# ముచ్చు

పాలగిరి వేణు

జె. జె, ఇండస్ట్రీస్ మెయిన్ గేటుముందు ఆగింది ఆటో ... మీటరు ఛార్జికన్న ఓ రూపాయి ఎక్కువిచ్చి ఆటోలోంచిదిగాను... మెయిన్ గేటుకు ఆనుకునే సెక్యూరిటీ ఆఫీసువుంది...

''ఎస్... ప్లీజ్...''

పర్సనల్ ఫైల్లోంచి ఇంటర్వ్యూ లెటరుతీసి చూపించాను.

ఇంటర్వ్యూకు పిలవబడ్డ అభ్యర్థులజాబితాలో నా పేరుదగ్గర గుర్తుపెట్టాడు డ్యూటీ సెక్యూరిటీ ఇన్ ఛార్జ్.

నే నెక్కడకెళ్ళాల్సింది ... ఇంటర్వ్యూ ఎన్ని గంటలకు మొదలెట్టేది విశదీకరించాడు అతడు... 'ఎంట్రీపాస్' చేతికిస్తూ ''విష్ యూ బెస్ట్ ఆఫ్ లక్''అంటూ నా కుడి అరచేతిని మృదువుగా, స్నేహపూర్వకంగా నొక్కాడు.. ''థ్యాంక్స్'' అంటూ అతడిదగ్గర శెలవు తీసుకున్నాను... ఫర్లాంగు దూరంలో కనపడుతోంది ''అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్''. అక్కడే నా యింటర్వ్యూ జరుగుతుంది. ఓ అరగంటతర్వాత... ముందుకునడిచాను.

ఇంతలో మెయిన్ గేట్లోంచి ఓ నల్లటి అంబాసిడర్ కారు రోడ్డుమీదకు దూకింది... సెక్యూరిటీ స్టాఫ్ సెల్యూట్ చేశారు అతివినయంగా... కారులో వున్న అతడు హుందాగా తల ఆడిస్తూ డ్రైవ్ చేసుకుంటూ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ వైపు దూసుకుపోబోయి... ఒక్కసారిగా బ్రేక్ వేసి, కారును నా ప్రక్కగా ఆపాడు... ''ప్లీజ్... గెటిన్...''అంటూ తలుపుతీశాడు... ''థ్యాంక్యూ సార్...'' అంటూ అతడిప్రక్కన కూచున్నాను ... ''ఆర్ యూ అటెండింగ్ ది ఇంటర్వ్యూ ఫార్ అక్కౌంట్స్ ఆఫీసర్ పోస్ట్.''

''యస్... సార్ !''

''యూ ఆర్ ఫ్రం...'' అతడి దృష్టంతా రోడ్డుమీదే వుంది .

''ఆంధ్రప్రదేశ్...''

''వెరీ గుడ్... మీ పేరు...?''

ఆశ్చర్యపోయాను... ''సార్! మీరు...''

''తెలుగువాణ్ణే... మాది నెల్లూరు... మీ పేరు చెప్పలేదు.''

''భార్గవ''

అతడేం మాట్లాడలేదు. నావైపు నిశితంగా చూశాడు... పార్కింగ్ లో కారాపాడు ... కారుతలుపు తీసి మీరెళ్ళొచ్చు అనేలా మరోసారి చూశాడు. ''థ్యాంక్స్...'' అంటూ మరోసారి చెప్పి ముందుకు కదిలాను.

మనిషి ఎంతో రాజసం గావున్నాడు...ఆరడుగుల ఎత్తు ... తగ్గట్టే లావు ... అందంగా పెంచబడిన గడ్డం... అవును ఎంతో అందంగా వున్నాడు గొప్ప హోదాలో వున్నట్లుంది... కాని నొసటన కాల్చిన మచ్చ... అదే శ్యామలరావును గుర్తుకు తెస్తోంది. పాపం ఎక్కడున్నాడో ? ఏమో??...

''ఎస్... మిస్టర్ ప్లీజ్ షో యువర్ సర్టిఫికెట్స్...''


సర్టిఫికెట్స్ అన్నీ చూపాను. ఇంటర్వ్యూ యింకో పది నిముషాల్లో మొదలవుతుందని చెప్పాడు పర్సనల్ ఆఫీసర్ నా సర్టిఫికెట్లను తిరగేస్తూ..

ఇంటర్వ్యూకు వచ్చినవాళ్ళము ఆరుగురం.. ఒక్కరేమో బీహార్ నుండి, ముగ్గురేమో ఉత్తర్ ప్రదేశ్ నుండి, ఇంకొకరు కేరళనుండి... అందరం పరిచయం చేసుకొన్నాం... చదువు అందరిదీ ఒక్కటే అయినా వయసు. అనుభవం ఎక్కువగా నాకే వున్నాయి. మానసికంగా సంతోషించాను. మొదటి రౌండ్ గెల్చానేమోననిపించింది.

ఏమిటో యీ వుద్యోగం ... స్వంత వూరికి కొన్ని వందల మైళ్ళ దూరంలో ... ఆప్తులను, ఆత్మీయులను వదలి...వచ్చే కొంత హెచ్చు జీతం రాళ్ళకోసం...కాదు...కాదు హోదా కోసం యిలా రావల్సి వచ్చింది ... నా దృష్టిలో హోదా ముందు అన్నీ దిగదుడుపే ... ప్రస్తుతం మా వూళ్ళోనే ఓ గ్లాసు ఫ్యాక్టరీలో అక్కౌంటెంటుగా పనిచేస్తున్నాను ... జీతం కూడ అన్నీ కలిపితే పదిహేను వందలు దాటుతోంది. అన్నివిధాల హాయిగా వున్న సంసార జీవితాన్ని గడుపుతున్నాను. స్వంత యిల్లు...పెద్దలు సంపాదించి పెట్టిన కొంత పొలం ... అన్నీ బాగానే వున్నాయి. కాని వుద్యోగరీత్యా నాకు తృప్తి లేదు.

ఎనిమిదేళ్ళుగా అక్కౌంటెంటుగాన వుంటున్నాను. నాపైన చీఫ్ అక్కౌంటెంటు ... అతను రిటైర్డు అన్నాకావాలి ... లేకపోతే ధామ్మనైనా బక్కెట్నైనా తన్నేయాలి. అంతేగాని నేను చీఫ్ అక్కౌంటు అయ్యే అవకాశమే లేదు మరి ... చీఫ్ అక్కౌంటు మాంచి ఆరోగ్యంగా వున్నాడు...కాబట్టి యింకో పదేళ్ళదాకా ఆ మాటే ఎత్తడానికి వీల్లేదు. చేసిందే చేస్తూ, పాడిందే పాడుతూ...ఆడిందే ఆడుతూ...నో ఛేంజ్ ... ఎంత దూరమైనా ... ఎక్కడైనా...హోదాగ బ్రతకాలి...అంతేమరి... నా నిర్ణయానికి తగ్గట్టుగానే నేను చార్టెడ్ అక్కౌంటన్సీ పూర్తిచేయడం జరిగింది...ఎప్పుడో పదేళ్ళక్రితం మొదలెట్టిన యీ కోర్సు యిప్పటికి అయింది ...

ఒకరోజున దినపత్రికలో చూశాను...''సీనియర్ అక్కౌంట్సు ఆఫీసర్సు'' కావాలని జెజె ఇండస్ట్రీస్, లక్నో వారు ప్రకటన చేశారు ... జీతం రెండువేలు దాటుతుంది ... పెర్క్స్ కూడా బావున్నాయి .. అప్లైచేశాను ... ఇంటర్వ్యూకు రమ్మని 'కాల్' పంపారు జెజె ఇండస్ట్రీస్ వారు .. లక్నో కెళ్ళి వుద్యోగం చేయడం మా ఆవిడకు యిష్టం లేదు. బంధువులకు, ఆప్తులకు కూడాను. కంపెనీవాళ్ళు రాకపోకలకు ఫస్టుక్లాసు ఛార్జీలు యిస్తున్నారు. కాబట్టే అలా హుషారుగా లక్నో కెళ్ళి వస్తానని, ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయితేగదా



వుద్యోగం వచ్చేది. అందులోకూడ జె కె ఇండస్ట్రీస్ వారికి హైదరాబాద్‌లో కూడ బ్యాటరీలు తయారు చేసే ఫ్యాక్టరీ ఒకటుందని, వుద్యోగమంటూ వస్తే హైదరాబాద్‌కి పోస్టు చేయాలని పట్టు పడ్తానని మావాళ్ళందరికి నచ్చచెప్పాను. హైదరాబాద్ అంటే మా ఆవిడకిష్టం.ప్రస్తుతం వాళ్ళ నాన్నగారు,అంటే మా మావగారు ఎక్సైజు సూపర్నెంటుగా హైదరాబాద్‌లో పనిచేస్తున్నారు. మరి... నేను సెలెక్ట్ అయినా, కాకపోయినా, నేను సి. ఏ. పాసయ్యాక ఇంటర్వ్యూ కెళ్ళడం మొదటసారి అనీను, అనుభవం వస్తుందనీను లక్నోకు రావటం జరిగింది

ఇంటర్వ్యూ మొదలయింది... మొదటగా కేరళ నుండి వచ్చిన నాయర్ ఇంటర్వ్యూ గదిలోని కెళ్ళాడు. మేమందరం సోఫాలో కూచుని, సెంటర్ స్ప్రెడ్ మీదున్న కొన్ని యింగ్లీషు మ్యాగజైన్స్ చూస్తూ కొంత 'రిఫ్రెష్' కాసాగాం... బీహారు నుండి వచ్చిన సిన్హా మాత్రం సోఫాకు ఓ మూలగా కూచుని, ఇంటర్వ్యూకు సంబంధించిన లాటాటె టాక్సేషన్ పుస్తకాన్ని తిరగేస్తున్నాడు. ఇంటర్వ్యూ గురించి నాకేం భయంలేదు... ఎందుకంటే బ్రతకడానికి నాకూ ఏలాగూ వుంది వుద్యోగం... కాని మా ఆరుమందిలో నల్గురు మాత్రం ఇంకా నిరుద్యోగులే... నాయర్ మాత్రం అతిపెద్ద రబ్బరు ఫ్యాక్టరీలో అక్కౌంట్స్ అసిస్టెంటుగా ఎనిమిది వందల జీతం తెచ్చుకుంటున్నాడట... పది నిముషాలు గడిచాయి. ఇరవయ్యో నిముషం గడుస్తుండగా నాయర్ బయటకు వచ్చాడు. ముఖంలో కళ లేదు ఎందుకో బాగా "అప్‌సెట్" అయినట్లున్నాడు. సోఫాలో కూచుని, రెండు నిముషాలు కళ్ళు మూసుకున్నాడు.

ఇంతలో కాఫీ సర్వ్‌చేశారు. మా అందరికీ... కాఫీ తాగాక నాయర్ కొంత స్థిమితపడ్డాడు... నాయర్‌చుట్టూ మూగాం అందరమూనూ.

"సబ్జక్ట్స్"మీద చాల లోతుగా వెళ్తున్నారు బాగా 'కన్‌ఫ్యూజ్' చేస్తున్నారు. నేను ఇంటర్వ్యూ సరిగా చేయలేదు... మరి నే వెళ్తా!... గుడ్‌లక్ ఫ్రెండ్స్ అంటూ నాయర్ మా అందరిదగ్గర శెలవు తీసుకున్నాడు.


'బెల్' మోగింది... ఇక నా వంతు


గదిలోనికెళ్ళాను ... ఎ. సి. రూం చల్లగా వుంది.

మెంబర్స్‌కు 'విష్' చేశాను... అందరికీ మధ్యలో వున్నాడు నాకు యిందాక కార్లో 'లిఫ్ట్' యిచ్చిన ఆంధ్రుడు... పాటించవలసిన సకల మర్యాదలను పాటించాను.., నా పేరు, నా వూరు, నా చదువు, నా అనుభవం గురించి అడిగారు.. అన్నీ పొల్లుపోకుండా చెప్పాను.

టాక్సేషను, ఇన్‌వెస్ట్‌మెంట్స్, ఇండియన్ లేబర్ ఎకానమీ గురించి ప్రశ్నలు అడిగారు... అంటంలో మరీ లోతుగా... నన్ను తికమక పెట్టబోయారు. నేను బాగా ప్రిపేరయి వెళ్ళటంవల్ల వాళ్ళ ప్రశ్నలకు సరియైన సమాధానాలు చెప్పాను.. ఉద్యోగం యిస్తే ఎన్ని రోజుల్లో చేరగలవని అడిగితే నెల రోజుల్లో అని చెప్పాను. వీలుంటే హైదరాబాద్‌లోగల తమ ఫ్యాక్టరీలో పోష్టింగ్స్ యిస్తే మంచిదని చెప్పాను... ఇంటర్వ్యూ మెంబర్లకు నా సమాధానాలు సంతృప్తి కల్గించినట్లు భావించాను. అందరిదగ్గర శెలవు తీసుకుని గదిలోంచి బయటపడ్డాను... మళ్ళీ నా చుట్టూ నలుగురూ ప్రశ్నలు చెప్పబోయేంతలో 'బెల్' మోగింది. ఈసారి సిన్హా వెళ్ళాడు. ఇంటర్వ్యూ గదిలోనికి... నా ఇంటర్వ్యూ గురించి మిగతావారికి చెప్పి అక్కణ్ణించి వచ్చేశాను.. మెయిన్‌గేట్‌దగ్గరే ఆటో దొరికింది... హోటల్ రూం చేరుకొని కొంతసేపు విశ్రాంతి తీసుకొని, అలా వూరుచూడ్డానికి వెళ్లాను ... ఆ రోజు సాయంకాలమే రైల్లో మా వూరికి బయల్దేరాను..

నేను లక్నో నుండి వచ్చి అప్పుడే నెలరోజులయ్యాయి...ఇంతవరకు నాకు 'ఆర్డర్స్'రాలేదు.. కుతూహలమంతా చచ్చిపోయింది...'రొటీన్'గా పాత






వుద్యోగానికి అంటుకుపోయాను...ప్చ్... పాతజీవితం మామూలే!

''సార్ ! మీకు వుత్తరం వచ్చిందం''టూ ఆంజనేయులు ఒక పొడువాటి కవర్ని తెచ్చిచ్చాడు. జెజె కంపెనీ నుండి వచ్చిన కవరది ... కవర్లో పలుచగా వుంది...అంటే 'రిగ్రెట్'లెటరయ్యుండాలి మరి ... కవర్ని చింపాను...కుతూహలంగా చదివాను ...అది జెజె ఇండస్ట్రీస్ ఫైనాన్స్ మానేజర్ ఎస్. ఆర్. మంత్రి రాశాడు. ఉత్తరం అచ్చు తెలుగులో వుంది.

ప్రియమైన భార్గవగారికి,

మీరు ఇంటర్వ్యూ బాగా చేశారు ...కాని మీరు ఆంధ్రులు ... నేను కూడాను ... ఈ విషయం ఇంటర్వ్యూ మెంబర్లందరికీ తెలుసు ... అల్లాంటప్పుడు మీకు ఉద్యోగం యిస్తే ఆంధ్రుడు ఆంధ్రుడికే యిచ్చి పక్షపాతంగా వ్యవహరించాడని అనుకునే అవకాశం వుంది ... అందుకని ... క్షమించండి ... యీ వుద్యోగాన్ని సిన్హాకు యిచ్చాం ... దయచేసి నా నిర్ణయాన్ని అన్యథా భావించకండి ...

ఇట్లు
ఎస్. ఆర్. మంత్రి ...

నేను ఈ వుత్తరం చదివి ఆశ్చర్యపోలేదు ... నాకు బాగా తెలుసు యీ వుద్యోగం నా వరకు రాదని ... అయినా మొదట్లో కొంత కుతూహలం చూపించేనేతప్ప...నాకు వుద్యోగం యిచ్చి ఆంధ్రుడు ఆంధ్రుడికే సాయించేసే అవకాశమే లేదక్కడ ... ఎస్. ఆర్. మంత్రి ... అంటే శ్యామలరావు ... మంత్రి యింటి పేరు ... నేను ఆరోజే గమనించాను...కార్లో నాకు లిఫ్ట్ యిచ్చిన ఆ పెద్దమనిషి శ్యామలరావని ... మా సంభాషణలో తను తెలుగు నాడినని చెప్పుకున్నా, భార్గవ అని నా పేరుచెప్పుకున్నపుడు, ముఖ కవళికల్నిపట్టే గ్రహించాను నన్నుకూడ తమగుర్తుపట్టినట్లు. ఆమూవుల్లోనేనంటేలయిష్టత కూడ చోటుచేసుకుంది... కారణం చెప్పనా !... సరిగ్గా పదమూడుసంవత్సరాల క్రితం... తిరపతిలో నేను, శ్యామలరావు బి.కాం లో సహాధ్యాయులం, హాస్టల్లో ఒకేగదిలో వుండేవాళ్ళం... శ్యామలరావుకు చదువుతప్ప వేరేధ్యాస వుండేదికాదు... క్లాస్‌లో ఫస్టున వచ్చేవాడు... నేను పేకాటకు బానిసనయిపోయాను... కాలేజిఎగ్గొట్టి స్నేహితులతో పేకాట ఆడుతుండేవాణ్ణి... శ్యామలరావు ఆర్థికంగా బలహీనుడు... వాళ్ళనాన్న ప్లీడరుగుమస్తా... ఒక్కో

## మచ్చ

సారి సకాలంలో డబ్బురాక, శ్యామలరావు హాస్టల్ బిల్ కట్టలేక, కాలేజీఫీజుకూడ కట్టలేక పోయేవాడు. ఫైనలియర్‌లో జరిగిన సంఘటన యీ కథకు ముగింపుకావచ్చు... మా రూంలో సుబ్బారెడ్డిఅని నెల్లూరురెడ్డి వుండేవాడు... ధనవంతుల గారాల బిడ్డ కావటంవల్ల, డబ్బు అతడిచేతిలో రెప రెపలాడేది... వందలకొలది నోట్లను ప్యాంటుజేబుల్లో, షర్టుజేబుల్లో పెట్టుకొని తిరిగేవాడు... ఆ రోజు నాకు బాగా గుర్తు... రాత్రి పదయ్యింది... సుబ్బారెడ్డి భోజనంచేసి పడుకుని నిద్రపోతున్నాడు... శ్యామలరావు చదువుకుంటూన్నాడు...కాని మనిషిలో ఆదోరకమైనమార్పు కనపడుతోంది... అప్పుడప్పుడు తన చూపంతా సుబ్బారెడ్డి వదిలినప్యాంటుమీద, షర్టుమీదే వుంది... మడతమంచంమీద పడుకొని, నిద్రరాక శ్యామలరావును గమనిస్తూనేవున్నాను... ఇంకోఅరగంట గడచింది... శ్యామలరావు మెల్లగా లేచాడు... సుబ్బారెడ్డి వైపు, నా వైపు చూశాడు... ఇద్దరం గాఢనిద్రలోవున్నట్లు నిర్ణయించుకొని, సుబ్బారెడ్డి ప్యాంటువైపు కదిలాడు. సుబ్బారెడ్డి ప్యాంటు జేబులో చేయి పెట్టాడు శ్యామలరావు.

''శ్యామలరావ్ !'' అంటూ సుబ్బారెడ్డి తన మంచంమీద నుంచి లేచి, వచ్చి శ్యామలరావు చేతిని గట్టిగాపట్టుకున్నాడు...ఆ కేకకు నేనుకూడ లేచాను. శ్యామలరావు వణికిపోతున్నాడు. కళ్ళల్లోంచి కన్నీళ్ళు కారుతున్నాయి... గట్టిగా ఏడుస్తున్నా శ్యామలరావు.

''ఎంత నీచమైన పనికి వడిగట్టావ్ శ్యామలరావూ !'' అంటూ నేను శ్యామలరావును ఛీదరించాను.

''నీకు డబ్బుకావాల్సివస్తే నన్ను అడగొచ్చుగా.. ఎందుకీ పనిచేశావ్ ?'' అంటూ సుబ్బారెడ్డి గదమాయించాడు శ్యామలరావును.

''చెప్పు... లేకపోతే అందర్నీ పిలవాల్సి వస్తుంది...''

''అప్పుడప్పుడు నా జేబుల్లో డబ్బు తగ్గుతూంటే ఏదో లెక్కతెలియక అనుకున్నాను... ఈ రోజు తెలిసింది నీ సంగతి...''

''లేదు... లేదు... ఈ రోజే మొదటిసారిగా తీయబోయాను ... అయినా దొరికిపోయాను... ఎందుకు తీశానో చెప్పమంటారా! చెప్తా వినండి.. నిన్నటినెల హాస్టలుబిల్లు కట్టలేకపోయాను... అందువల్ల హాస్టల్లోంచి నా పేరు కొట్టేశారు. 'మెస్'లో భోజనం పెట్టరు... నేను అన్నంతిని మూడు రోజులయింది. నా దగ్గర చిల్లిగవ్వకూడ లేదు. ఆకలితో చచ్చిపోతున్నాను... మీరిద్దరూ నా పాట్లు గమనించలేదు... నాక్కావలసింది ఒక్క రూపాయి మాత్రమే...ఓ అరడజను అరటిపళ్ళు తెచ్చుకొని కడుపు నింపుదామనుకొన్నాను... అంతేగాని వేరే వుద్దేశంలేదు సుబ్బారెడ్డీ! నన్ను క్షమించు...'' అంటూ సుబ్బారెడ్డి చేతుల్ని పట్టుకొని ఏడ్చేశాడు శ్యామలరావు.

సుబ్బారెడ్డి కరిగిపోయాడు.

''శ్యామలరావూ ! నీకు యిక ఏ కష్టాలు వుండవు...హాస్టలుకయ్యే ఖర్చంతా నేను భరిస్తాను. పద... అలా బైటకు వెళ్ళొద్దాం'' అంటూ సుబ్బారెడ్డి శ్యామలరావును హోటల్‌కు తీసుకెళ్ళాడు... ఇది అప్పటి సంగతి...

ప్రస్తుతం అతను పెద్ద హోదాలో వున్నాడు అప్పటి స్థితిగతుల్ని మరచి, కొత్త జీవితానికి అలవాటుపడ్డాడు శ్యామలరావు. కష్టపడి చదివి హోదాను సంపాదించుకున్నాడు. అల్లాంటప్పుడు నన్ను తన కంపెనీలో వుద్యోగంలో చేర్చుకుంటే ఆనాటి సంఘటన పదే పదే గుర్తుకువచ్చి, మానసిక శాంతికి దూరమవడం మాత్రం నిజం... అందుకని నాకు వుద్యోగం యివ్వలేదు శ్యామలరావు... అదీగాక నేను పాత పరిచయాన్ని ముడిపెట్టుకొని, ఎలా ప్రవర్తిస్తానో అనే భయంకూడ శ్యామలరావుకు తప్పక కల్గివుండాలి.

కాని శ్యామలరావుకు, సుబ్బారెడ్డికి తెలియని సంగతి ఒకటుంది... పేకాటకు ఎప్పుడు డబ్బు తక్కువబడ్డా నేను సుబ్బారెడ్డి ప్యాంటులోంచిగాని షర్ట్‌లోంచిగాని సంగ్రహించాను. అది ఎవరూ కనిపెట్టలేకపోయారు. ఆ రోజు రాత్రికూడ అదే పరిస్థితి. రేపు పేకాట ఆడేందుకు డబ్బులేదు శ్యామలరావు ఎప్పుడు పడుకుంటాడోలని దొంగనిద్ర నటించాను. కాని శ్యామలరావు దొరికిపోయాడు అదే నేను దొరికుంటే సుబ్బారెడ్డి నన్ను ఏం చేసేవాడు ? నా పరువు, ప్రతిష్టలు ఏమయ్యేవి...? అనుకుంటేనే భయంగావుంది నాకు. ఫ్యానుగాలికి శ్యామలరావురాసిన వుత్తరం ఎగిరిపోతూంటే, చిక్కించుకుని, ముక్కలు గాచించి, ''డస్ట్‌బిన్''లో వేశాను, ''ట్రయల్‌బాలన్స్'' వందల్లోతంతోంది మరి... ★